క్లుప్తంగా

గిరి ప్రదక్షిణ పనులు ప్రారంభం



గిరి ప్రదక్షిణకు రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కొండగట్టు: కొండగట్టు అంజన్న గిరి ప్రదక్షిణకు కావాల్సిన రోడ్డు నిర్మాణానికి బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భూమిపూజ చేశారు. తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణ మాదిరిగానే కొండగట్టులోనూ ప్రదక్షిణకు ఏర్పాట్లు చేస్తామన్నారు. నాయకులు ఆనంద రెడ్డి, దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, ముత్యం శంకర్, హరినాథ్, సతీశ్ రెడ్డి, శనిగారపు తిరుపతి, కటకం వినయ్, వెంకటేశ్, మర్రి లక్ష్మణ్, లక్ష్మణ చారి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అధికారుల తనిఖీ



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి పనులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు తెలిపారు. అనంతరం పిల్లలకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించి, మెను ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నారా, రుచికరంగా ఉంటుందా విద్యార్థులను అడిగి తెలుసుకుని, వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో రజిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లన్న జాతరకు పటిష్ట భద్రత ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

గొల్లపల్లి: డిసెంబర్‌లో జరగనున్న మల్లన్నపేట మల్లికార్జునస్వామి జాతరకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు ధర్మపురి సీఐ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మల్లన్నపేట మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శించి భద్రత ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. జాతర సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు సతీశ్, శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బీమ సంతోష్, ఆలయ కమిటీ ట్రస్టీ శాంతయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



ఎంపికైన క్రీడాకారులతో ఎంఈవో, పీడీలు

జగిత్యాలరూరల్: క్రీడలతో ఆటగాళ్ల మధ్య స్నేహభావం ఏర్పడుతుందని ఎంఈవో గాయత్రి అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 68వ ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి నెట్‌బాల్ క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకుని క్రీడల్లో గెలుపే లక్ష్యంగా శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం సరోజన, జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ లక్ష్మీరాంనాయక్, పీడీలు మల్లీశ్వరి, విజయ పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో తనిఖీ



ఆస్పత్రి తనిఖీ చేస్తున్న జైపాల్‌రెడ్డి

రాయికల్: పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను బుధవారం ఎంహెచ్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జైపాల్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించుకోవాలని సూచించారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ సతీశ్, హెచ్ఈవో సాగర్‌రావు, సూపర్‌వైజర్ శ్రీనివాస్, శ్యామ్ పాల్గొన్నారు.

జరిమానాలతోనే సరి..

- పట్టణంలో కనిపించని ప్లాస్టిక్ కవర్ల నిషేధం
- విచ్చలవిడిగా విక్రయాలు, వినియోగం
- పట్టించుకోని అధికారులు..



ఓ వ్యాపారికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెట్‌పల్లి: ప్రభుత్వం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినా... వ్యాపారులు పట్టించుకోవడం లేదు. పర్యావరణం, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించింది. అయినప్పటికీ మార్కెట్‌లో ఇవి లభ్యమవుతుండడంతో ప్లాస్టిక్ వాడకం యథేచ్ఛగా సాగుతోంది. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అడపదడపా తనిఖీలు జరుపుతూ జరిమానాలు విధిస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప పూర్తి స్థాయిలో నియంత్రించడంపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కడ చూసినా అవే..

పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. చిన్న కొట్టు నుంచి మొదలుకొని కూరగాయల మార్కెట్, హోటళ్లు, హోల్‌సెల్ దుకాణాలు తదితర ప్రతి చోట వీటిని వాడుతున్నారు. స్థానికంగా కవర్లు విక్రయించే హోల్‌సెల్ దుకాణాలు పది వరకు ఉన్నాయి. వాటి నుంచి చిరు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వీరు సరుకులను కవర్లలో పెట్టి అందిస్తున్నారు. ప్రతి రోజు వేల సంఖ్యలోనే నిషేధిత కవర్లను వినియోగిస్తున్నారు.

తనిఖీలతో ప్రయోజనం శూన్యం..

మున్సిపల్ శానిటేషన్ విభాగం సిబ్బంది దుకాణాల్లో తరుచుగా తనిఖీలు నిర్వహిస్తూ జరిమానాలు విధిస్తున్నారు. అయినా ఇవి అంతగా ఫలితమివ్వడం లేదు. జరిమానాలు చెల్లిస్తున్న వ్యాపారులు ఆ తర్వాత తిరిగి యథావిధిగా విక్రయాలు, వినియోగం చేస్తున్నారు. నామమాత్ర తనిఖీలతో సరిపెట్టకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకుంటేనే ప్రయోజనముంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దృష్టి సారిస్తాం

ఇతర పనుల వల్ల ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోతున్నాం. అయినప్పటికీ తరుచుగా తనిఖీలు నిర్వహిస్తూ వ్యాపారులను హెచ్చరిస్తున్నాం. కుటుంబ సర్వే పూర్తి కాగానే.. ప్లాస్టిక్‌కు అడ్డుకట్టవేయడంపై దృష్టి సారిస్తాం. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– రత్నాకర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్



వెల్గటూర్ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–3లో మరుగుదొడ్డి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. కానీ ఇప్పటికీ నిర్మాణం పునాదుల దశలోనే ఉంది. 40 రోజుల క్రితం పునాదులు తవ్వి వదిలేశారు.అంగన్‌వాడీ కేంద్రంలో పేరుకే బోర్‌వెల్ ఉన్నా అది పని చేయడం లేదు. అంగన్‌వాడీ కేంద్రం అవసరాలకు, టాయిలెట్ నిర్మాణానికి నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. బోర్‌వెల్ మరమ్మతు చేయించి, టాయిలెట్ నిర్మాణం పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మామిడి శంకర్, పంచాయతీ కార్యదర్శి సెల్ నం.: 9666605432

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

మెరుగైన వైద్యసేవలకు పల్లె దవాఖానాలు

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



పల్లె దవాఖానాకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న పల్లెదవాఖానాకు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు వ్యాధులు వచ్చిన తర్వాత వాడటం కన్నా వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. నిత్యం వ్యాయామం, యోగా, కాలినడకతో ఆరోగ్యం కాపాడుకోవచ్చన్నారు. నియోజకవర్గానికి అత్యధికంగా 29 పల్లె దవాఖానాలు మంజూరయ్యాయన్నారు. సీడ్‌ప్రాసెస్ యూనిట్ కూడా త్వరలో పూర్తి చేస్తామని, ఇప్పటికే ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డితో మాట్లాడానన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రమోద్, డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పొలాస్తేశ్వరస్వామి ఆలయంలో పూజలు

పొలాస పౌలస్తేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్–రాధిక దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు.

అభినందన

సారంగాపూర్: మండల కేంద్రానికి చెందిన సాయిని తిరుపతి పొలాస వ్యవసాయ కళాశాలలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ కోర్సులో గోల్డ్‌మెడల్ సాధించగా, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అభినందించారు. తిరుపతి గోల్డ్ మెడల్ సాధించడం సంతోషంగా ఉందన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

జగిత్యాల: సీఎం సహాయనిధి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు బుధవారం చెక్కులు అందించారు. కార్యక్రమంలో నాయకులు బాలె శంకర్, మల్లారెడ్డి, తిరుపతి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆరె రవి, అంజయ్య పాల్గొన్నారు.

సీఎం సోదరుడి కుమార్తె వివాహానికి ఎమ్మెల్సీ హాజరు



జగిత్యాల: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి కూతురు వివాహం హైదరాబాద్‌లో బుధవారం జరుగగా పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నృసింహుడిని దర్శించుకున్న రవి



నృసింహుడి సన్నిధిలో కమెడియన్ సత్తి

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామిని బుధవారం ప్రముఖ కమెడియన్, యాంకర్ రవి అలియాస్ బిత్తిరి సత్తి దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంతో పాటు అనబంధ ఆలయల్లో స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

మేడిపల్లి: డిసెంబర్ ఒకటిన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న మాల, మాల ఉపకులాల ఆత్మ గౌరవ సభ వాల్ పోస్టర్‌ను బుధవారం భీమారం మండలంలోని గోవిందారంలో మాల సంఘం నాయకులు ఆవిష్కరించారు. మాలలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నెల్లుట్ల ప్రభాకర్, దయ్యా గోపి, బిటుకు రవీందర్, బింగి లచ్చయ్య, గుర్రపు లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



కోరుట్ల/మెట్‌పల్లిరూరల్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి,మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్, ఫార్మసీని పరిశీలించి మందులపై ఆరా తీశారు. అన్ని మందులు అందుబాటులో ఉంచాలన్నారు.డయాలిసిస్ సెంటర్‌ను పరిశీలించారు.ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న పలువురిని వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వంట శాలను పరిశీలించి రోగులకు ఎలాంటి ఆహారం అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమాల్లో సూపరింటెండెంట్లు డాక్టర్ సునీత,సాజిద్ అహ్మద్, వైద్యులు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడతాం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్ల: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం తహసీల్దార్ కిషన్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మాడవేణి నరేశ్, పెండెం గణేశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ యాదగిరి బాబు, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, నాయకులు తిరుమల వాసు, వడ్డెపల్లి శ్రీనివాస్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలాల సాయిచంద్ పాల్గొన్నారు.

మల్లాపూర్: హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడుతామని బీజేపీ మండల అధ్యక్షులు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ వీర్‌సింగ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో పాటు మూతపడ్డ నిజాం చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని ఇచ్చి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇకపై ప్రజల పక్షాన క్షేత్రస్థాయిలో హామీలు అమలయ్యే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, పట్టణ అధ్యక్షుడు ముష్కెరి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచిన రైతులను మోసం చేసిందని, బీజేపీ మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ ఒక్కరి కూడా నెరవేర్చలేదన్నారు. 70 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, ఇప్పటివరకు రైతుభరోసా ఇవ్వలేదని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్, గోపాల్, శేఖర్, రాకేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే చేరండి



విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

మల్యాల: పదో తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరంలో ఇంటర్ మీడియేట్ ప్రథమ సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణ కోరారు. మండలంలోని తాటిపెల్లి, బలవంతపూర్ పాఠశాలల్లో బుధవారం విద్యార్థులతో సమావేశమయ్యారు.. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా నాణ్యమైన బోధన అందిస్తూ, ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నమని తెలిపారు. విద్యార్థులు మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అత్తినేని శ్రీనివాస్, మహమ్మద్ నవాబ్, యములశ్రీనివాస్, పురాణం శ్రీధర్, తాటిపల్లి హెచ్ఎం గౌతమ్ కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• నోటీస్ బోర్డుపై పోస్టుల జాబితా

జగిత్యాల: జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల ఖాళీల భర్తీ కోసం దరఖాస్తు చేస్తున్న అభ్యర్థుల ప్రాథమిక జాబితా డీఎంహెచ్‌వో కార్యాలయ నోటీస్‌బోర్డుపై ఉందని, వివరాలు చూసుకోవాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలుంటే 28 నుంచి వచ్చేనెల 5 వరకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో రాతపూర్వకంగా సమర్పించాలన్నారు.

• విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కోరుట్ల: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి, వారిని జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలకు పంపుతామని ఎంఈవో నరేశం తెలిపారు.

మేడిపల్లి: ప్రజా పాలన విజయోత్సవ వేడుకల్లో భాగంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 8,9 వ తరగతి విద్యార్థులకు మేడిపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో ఆకుల లక్ష్మీ నర్సయ్య తెలిపారు.

• మామిడి కౌలు రైతుల కార్యాలయం ప్రారంభం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలో మామిడి కౌలు రైతుల కార్యాలయాన్ని బుధవారం జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ దావ వసంత ప్రారంభించారు. మామిడి కౌలు రైతులకు అందుబాటులో ఉంటామని చెప్పారు. జగిత్యాల మామిడికి దేశ, విదేశాల్లో మంచి గుర్తింపు ఉందని, ఆ గుర్తింపును కాపాడాలని కోరారు.

• ప్రార్థన మందిరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

గొల్లపల్లి: మండలంలోని ప్రార్థన మందిరాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సతీశ్ అన్నారు. బుధవారం ప్రార్థన మందిరాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రార్థన మందిరాల్లో తప్పనిసరిగా సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

• పొలాస్తేశ్వరస్వామి ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పూజలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులోని పొలాస్తేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి–లక్ష్మణ్ దంపతులు పెళ్లి రోజును పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేసి, అయ్యప్ప స్వామి భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.

• నెట్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

మల్యాల: జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీల్లో మల్యాల వాగ్దేవి స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు గౌతమ్ చారి, హాసిని, సింధు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ పోకల నరేశ్ కుమార్ తెలిపారు.

• ఆలయ అభివృద్ధి కమిటీ నియామకం

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలోని శ్రీ లొంక వెంకట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడి గా గుండేటి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా బద్ది లక్ష్మణ్, ఏలేటి సతీశ్ రెడ్డి, కార్యదర్శులుగా చెక్కపెల్లి సంజీవ్, ఒల్లల్లా నరేష్ గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గుగ్గిల్ల రవి గౌడ్, పల్లికొండ గణేశ్, పల్లి అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

• కేడీసీసీబీలో సంబరాలు

ఇబ్రహీంపట్నం: జిల్లా కేడీసీసీ బ్యాంకు ఉత్తమ సహకార బ్యాంకుగా ఎంపికై కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సీఈవో ఎస్ సత్యనారాయణరావు అవార్డు అందుకోవడంతో బుధవారం ఇబ్రహీంపట్నం కేడీసీసీ బ్యాంకులో బ్యాంకు మేనేజర్ రామకృష్ణ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాతాదారులు, సిబ్బందితో కలిసి కేక్‌ను కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ ఖలీల్ పాషా, సిబ్బంది, పాల్గొన్నారు.

• నిప్పంటుకుని కాలిపోయిన వరి పొలం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కమ్మునూర్ గ్రామ శివారుల్లో వెలమ మహిపాల్‌రెడ్డి అనే రైతు సాగుచేసిన వరి పొలం నిప్పంటుకుని కాలిపోయింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మహిపాల్‌రెడ్డి పొలం పక్కనే ఉన్న మరో ఇద్దరు రైతులు తమ వరి పొలాన్ని కోసి కొయ్యలకు నిప్పంటించారు. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి మహిపాల్‌రెడ్డి 30 గుంటల విస్తీర్ణంలోని కోసే పొలం మొత్తం కాలిపోయింది. బాధిత రైతు ఫిర్యాదుతో బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి, పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం పరిహారం అందించి తనకు న్యాయం చేయాలని రైతు కోరుతున్నాడు.

• కల్లెడలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ చెరువులో బుధవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహన్ని వెలికితీసి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చారు. గ్రామంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న 30–38 ఏళ్ల వ్యక్తి ఊర చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపర్చినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

• న్యాయవాదుల సంఘం అధికార ప్రతినిధిగా లింబాద్రి

మెట్‌పల్లిరూరల్: తెలంగాణ ఫెడరేషన్ న్యాయవాదుల సంఘం అధికార ప్రతినిధిగా మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి నియామకమయ్యారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు కొండల్‌రెడ్డి బుధవారం ఆయనకు సమాచారమిచ్చారు. ఈ సందర్భంగాలింబాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



బ్యాంకు సందర్శనలో విద్యార్థులు

మల్యాల: క్షేత్ర పర్యటనతో విద్యార్థులకు చాలా లాభాలు చేకురుతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక అల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్ విద్యార్థులు పాఠశాల తరగతి విద్యా ప్రణాళికలో భాగంగా కరూర్ వైశ్య బ్యాంక్‌కు సందర్శనకు వెళ్లే ముందు విద్యార్థులతో ముచ్చటించారు.విద్యార్థులు ప్రాథమికస్థాయి నుండే వివిధ అంశాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులకు బ్యాంకు సిబ్బంది బ్యాంకు పనితీరు, లావాదేవీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు శిఖంలో మట్టి తొలగింపు



మట్టిని తొలగిస్తున్న ఇరిగేషన్ అధికారులు

మల్యాల: మండలంలోని మానాలలో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో స్థానిక రైతు మట్టి పోయడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు నీటి పారుదల శాఖ అధికారులు బుధవారం చెరువులో అక్రమంగా పోసిన మట్టిని జేసీబీతో తొలగించారు. డీఈఈ తిరుపతి ఆదేశాల మేరకు బుధవారం ఏఈఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ మానాల గ్రామంలోని రంగోజీ కుంట శిఖంలో పోసిన మట్టిని తొలగించారు. రైతులు చెరువులోని పట్టా భూములు చెరువులో నీరు లేనప్పుడు సాగు చేసుకోవాలని, చెరువులో మట్టి పోసి ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్

బుగ్గారం: మండల వాసుల కల ఎట్టకేలకు నెరవేరింది. బుగ్గారం వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని ఆర్టీసీ జగిత్యాల డిపో మేనేజర్ సునీత బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ విప్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.